సాక్షి సూర్యాపేట

ఆదివారం । 17 । మార్చి । 2024



గోదావరి నీళ్లు నిలిపివేత

అర్వపల్లి: వారబందీ విధానంలో ఐదో విడత జిల్లాకు విడుదల చేస్తున్న గోదావరి జలాలు శనివారం నిలిపివేశారు. నాలుగు రోజులకే నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



లోక రక్షకుడిగా..

యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం లక్ష్మీనరసింహస్వామి గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-32 (ఆదివారం సా॥)

సహర్ 5-00 (సోమవారం ఉ॥)

న్యూస్‌రీల్

ముగ్గురికి కార్పొరేషన్ పదవులు

- పటేల్ రమేష్‌రెడ్డి, ప్రీతమ్, బండ్రు శోభారాణికి దక్కిన అవకాశం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురికి కార్పొరేషన్ పదవులు దక్కాయి. వారి నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ పటేల్ రమేష్ రెడ్డిని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన సూర్యాపేట టికెట్ ఆశించినా.. అక్కడ రాంరెడ్డి దామోదర్ రెడ్డికి టికెట్ దక్కింది. రమేష్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామన్నా అది కూడా ఇవ్వలేదు. దీంతో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు మండల కేంద్రానికి చెందిన ప్రీతమ్‌కు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి అప్పగించింది. ప్రీతమ్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి టికెట్ ఆశించారు. ఆలేరు నియోజకవర్గ కేంద్రానికి చెందిన బండ్రు శోభారాణికి తెలంగాణ స్టేట్ ఉమెన్స్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది.

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేసుకోవాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు విధిగా గ్యాస్ ఈ-కేవైసీ చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో గ్యాస్ డీలర్స్, సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్యాస్ కనెక్షన్ లైవ్‌లో ఉండాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని, ఇప్పటికి ఈ-కేవైసీ చేసుకోని వారు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. వ్యాపారులు కమర్షియల్ సిలిండర్ మాత్రమే వాడాలన్నారు. గ్యాస్ బాయ్స్‌తో ఇబ్బందులు రాకుండా డీలర్లు, అధికారులు చూడాలన్నారు. సంవత్సర కాలంలో ప్రతి వినియోగదారులు 12 సిలిండర్‌లు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ మోహన్ బాబు, కొటేశ్వరి, వివిధ కంపెనీల గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

'కుష్టు వ్యాధి' సర్వే పకడ్బందీగా చేపట్టాలి

చివ్వెంల: కుష్టు వ్యాధి నిర్మూలనకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. శనివారం చివ్వెంలలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ గదిని పరిశీలించారు. సిబ్బంది, సబ్ సెంటర్లు, ఇతర వివరాలను వైద్యాధికారి భవానిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, పోగ్రాం అధికారి కల్యాణ్, మండల సూపర్‌వైజర్ శిరోమణి, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ అనునయి

సూర్యాపేట: సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ అనునయి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ప్రస్తుతం సూర్యాపేట మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. జనరల్ ఆస్పత్రిగా ఆవిర్భవించిన నాటి నుంచి సూపరింటెండెంట్‌గా డాక్టర్ దండ మురళీధర్‌రెడ్డి కొనసాగారు. ఈయనను అసిఫాబాద్ ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ సర్జన్‌గా నియమిస్తూ ఆ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మోగిన నగారా



ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్

ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల దాఖలు

ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ

జూన్ 4న ఓట్ల లెక్కింపు

లోకసభ నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాలు (08.02.2024 నాటికి)

అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
భువనగిరి				
భువనగిరి	1,28,548	1,11,358	1	2,39,907
ఆలేరు	1,16,344	1,17,497	19	2,33,860
మునుగోడు	1,27,547	1,28,513	3	2,56,063
నకిరేకల్(ఎస్సీ)	1,25,005	1,27,625	3	2,52,633
తుంగతుర్తి(ఎస్సీ)	1,28,240	1,29,752	7	2,57,999
జనగామ	1,18,929	1,22,207	9	2,41,145
ఇబ్రహీంపట్నం	1,69,713	1,67,298	36	3,37,047
మొత్తం	9,14,326	9,04,250	78	18,18,654
నల్లగొండ				
దేవరకొండ	1,31,599	1,30,241	18	2,61,858
నాగార్జునసాగర్	1,15,545	1,20,228	21	2,35,795
మిర్యాలగూడ	1,15,352	1,19,956	26	2,35,334
నల్లగొండ	1,20,556	1,27,109	57	2,47,722
సూర్యాపేట	1,18,510	1,24,422	13	2,42,945
హుజూర్‌నగర్	1,21,390	1,28,692	17	2,50,099
కోదాడ	1,19,295	1,25,889	17	2,45,201
మొత్తం	8,42,247	8,76,538	169	17,18,954

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- అమల్లోకి వచ్చిన కోడ్
- ఏప్రిల్ 1వరకు ఓటరు నమోదుకు చాన్స్
- ఎన్నికల పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు
- టికెట్ కోసం ఆశావహుల తీవ్ర ప్రయత్నాలు
- ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ
- మే 13న పోలింగ్



సూర్యాపేటలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది



భీంరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల నగారా మోగింది. ఎలక్షన్ కమిషన్ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం సాయంత్రం విడుదల చేసింది. షెడ్యూల్ విడుదలతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. మన రాష్ట్రంలో నాలుగో విడతలో పోలింగ్ సాగనుంది. ఎన్నికల నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే తక్షణం స్పందిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల బరిలో నిలిచేందుకు రాజకీయ పార్టీలు తమ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి.

ఓటరు నమోదు మరో చాన్స్

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నల్లగొండ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. భువనగిరి పరిధిలో భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు, జనగాం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలు ఉన్నాయి. కాగా.. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 17,18,954 మంది, భువనగిరి పరిధిలో 18,18,654 మంది ఓటర్లు ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఓటరునమోదు, మార్పులు చేర్పుల కోసం ఏప్రిల్ 1వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వృద్ధులు కూడా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించునే అవకాశాన్ని కల్పించింది.

అమల్లోకి వచ్చిన కోడ్

పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ప్రజా ప్రతినిధులు అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి వీల్లేదు. అధికార యంత్రాంగం ఇప్పటికే నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయిస్తోంది. పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

టికెట్ ప్రయత్నాల్లో ఆశావహులు

ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు బీజేపీ మాత్రమే ఇద్దరు అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ ఒక స్థానానికే అభ్యర్థిని ప్రకటించింది. బీఆర్‌ఎస్ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఆశావహులు మాత్రం టికెట్‌ను దక్కించుకునేందుకు అధిష్టానం వద్ద మంతనాలు జరుపుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లోనే అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్‌ను వీడి ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, భువనగిరి నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను అభ్యర్థులుగా బీజేపీ ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన విషయం తెలిసిందే. కాగా భువనగిరి అభ్యర్థిని మూడు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం రెండు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమవుతోంది.

భువనగిరి నుంచి రెండుసార్లు కాంగ్రెస్

2009లో ఏర్పడిన భువనగిరి లోక్‌సభ స్థానానికి తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా రెండోసారి బరిలో దిగిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై అప్పటి టీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజయం సాధించారు. తాజాగా జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, వామపక్షాలు రంగంలోకి దిగబోతున్నాయి. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మంచి పట్టు ఉంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆలేరు, భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా.. జనగామలో ఒక్క చోట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉన్నారు. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ భువనగిరి సీటు బీసీలకు కేటాయించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

సమర్థవంతంగా 'కోడ్' అమలు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, జిల్లాలో ఎన్నికల కోడ్ సమర్థవంతంగా అమలు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, విధివిధానాలపై ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ గెజిట్ నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడదల కానున్నదని పేర్కొన్నారు. అనంతరం ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారని, 26 నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గాలు, భువనగిరి పార్లమెంట్ పరిధిలోని తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఉన్నాయన్నారు. జిల్లాలో జిల్లాలో 9,97,065 మంది ఓటర్లు ఉన్నారని, నాలుగు నియోజక వర్గాల్లో 1,201 పోలింగ్ కేంద్రాలు, 112 రూట్స్ ఏర్పాటు చేశామన్నారు. 123 మంది సెక్టార్ అధికారులు, మొత్తం 32 టీమ్‌లను నియమించామన్నారు. ఎన్నికల నిర్వహణకు 6,635 మంది సిబ్బందిని సిద్ధం చేశామని, ఆ వివరాలను ముఖ్య ఎన్నికల అధికారి సైట్‌లో పొందు పరిచామని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది డ్యూటీ సర్టిఫికెట్‌తో పనిచేసే చోటే ఓటేయవచ్చన్నారు. ఇతర జిల్లాల అధికారులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ ఎన్నికలు సమర్థవంతంగా చేపట్టేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకుంటామని, అన్ని చెక్ పోస్టుల్లో గట్టి నిఘా పెంచుతామని పేర్కొన్నారు. ఇప్పటికే రెండు పోలీస్ బలగాలు జిల్లాకు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో డీపీఆర్‌ఓ రమేష్ కుమార్, డీఈఓ ఆశోక్, డీఈఈ మల్లేశం, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో ఐటీఐ కళాశాల




సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- సచివాలయంలో అధికారుల సమీక్షలో వెల్లడి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌కు ఐటీఐ కళాశాల మంజూరు చేసినట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్, కోదాడ ఏరియా ఆస్పత్రుల్లో రూ.6.24 కోట్లతో సిటీ స్కానింగ్ మిషన్లు, హుజూర్‌నగర్ ఆస్పత్రిలో నూతన వైద్య పరికరాలకు రూ.25 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. హుజూర్‌నగర్‌లో రూ.37కోట్లతో నిర్మించే ఐటీఐ కళాశాలకు అవసరమైన 5నుంచి 10 ఎకరాల స్థలం కోసం అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. హుజూర్‌నగర్, కోదాడలో రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్త మండలాలకు సొంత పరిపాలన భవనాల మంజూరుకు, రెడ్లకుంట వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. రెండు నియోజక వర్గాల్లో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణతోపాటు చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్‌లో ఎంపీపీ కార్యాలయం ముందు బీఓటీ పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. మోతె, నడిగూడెం, మునగాలకు ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని, అనంతగిరి హైస్కూల్‌కు కొత్త భవనం నిర్మించాలని, హుజూర్‌నగర్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టాలని పలువురు నాయకులు ఈ సందర్భంగా మంత్రికి విన్నవించారు. కాంగ్రెస్ పార్టీలో చేరికలను వ్యతిరేకించవద్దన్నారు. ఈ సమావేశంలో అధికారులు, రెండు నియోజక వర్గాలలోని బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మరొకరు ఔట్!

- బీఆర్‌ఎస్‌కు ఒక్కొక్కరుగా దూరమవుతున్న నేతలు
- తేరా చిన్నపరెడ్డి బీజేపీ టచ్‌లోకి వెళ్లినట్లు చర్చ
- ఇప్పటికే వెళ్లిపోయిన హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి
- బీఆర్‌ఎస్ నుంచి పోటీచేయనని స్పష్టం చేసిన గుత్తా అమిత్‌రెడ్డి
- పైళ్ల శేఖర్‌రెడ్డి సైతం పోటీకి విముఖత
- జిల్లాలో గులాబీ పార్టీకి గడ్డుకాలం



తేరా చిన్నపరెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మరొక నేత వెళ్లిపోయేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ నాయకుడు తేర చిన్నపరెడ్డి కూడా బీజేపీ నేతల టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కూడా ఐదు రోజుల క్రితం బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఆయనకు నల్లగొండ ఎంపీ టికెట్‌ను బీజేపీ ప్రకటించింది. పార్లమెంట్ ఎన్నికల ముంగిట బీఆర్‌ఎస్ నేతలు ఒక్కొక్కరుగా పార్టీకి దూరమవుతుండడం ఆ పార్టీ క్యాడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది.

గుత్తా కుటుంబం కూడా దూరమే..!

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గుత్తా అమిత్‌రెడ్డికి టికెట్‌పై బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రితో పాటు ఇద్దరు నేతలు కూడా వ్యతిరేకించిన నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల్లో తాను బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయనని అమిత్‌రెడ్డి అధిష్టానానికి చెప్పారు. ఆ తరువాత సీఎం రాజకీయ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని అమిత్ కలిశారు. సుఖేందర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను సమర్థించారు. దీన్నిబట్టి ఆయన కూడా కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న చర్చ జరుగుతోంది.

బీఆర్‌ఎస్ టికెట్ కోసం ప్రయత్నించి..

బీఆర్‌ఎస్ నుంచి నల్లగొండ ఎంపీ టికెట్ కోసం గుత్తా అమిత్‌రెడ్డి ప్రయత్నించి వదిలేసిన తరువాత ఆ స్థానానికి మాజీ ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డి, రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కూడా చిన్నపరెడ్డికి అనుకూలంగా ఉన్నట్లు వార్తలొచ్చాయి. అయితే టికెట్ కోసం కంచర్ల కృష్ణారెడ్డి పట్టుపడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ కవిత అరెస్టు వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో చిన్నపరెడ్డి బీజేపీ నేతలకు టచ్‌లోకి వెళ్లారన్న చర్చ జోరుగా సాగుతోంది. చిన్నపరెడ్డి గతంలో ఎమ్మెల్సీగా, ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత రెండోసారి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడంతో విజయం సాధించారు. నోముల నర్సింహయ్య మరణాంతరం సాగర్ అసెంబ్లీ టికెట్ ఆశించారు. కేసీఆర్ మాత్రం నర్సింహయ్య తనయుడు భగత్‌కే అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత చిన్నపరెడ్డి ఎమ్మెల్సీ పదవీ కాలం పూర్తయింది. మళ్లీ ఎమ్మెల్సీ అవకాశం ఇస్తారని భావించినా దక్కలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించినా అధిష్టానం పట్టించుకోలేదు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేందుకు నేతలు జంకుతున్న పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ అధిష్టానం చిన్నపరెడ్డిని ఎంపీగా చేయాలని సూచించడంతో ఆయన బీజేపీ నేతలతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

పోటీకి విముఖత చూపిన శేఖర్‌రెడ్డి

భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని కూడా అధిష్టానం ఎంపీగా పోటీ చేయాలని సూచించినట్లు ప్రచారం సాగుతోంది. అయితే, ఆయనమొదట్లో ఆసక్తి చూపినా ఆ తరువాత పోటీ చేయనని అధిష్టానానికి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన కాంగ్రెస్‌లోకి టచ్‌లోకి వెళ్లినట్లుగా చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు గడ్డు కాలం మొదలైందన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లోనే సాగుతుండటం గమనార్హం.

మోదీ సమావేశానికి హాజరైన సైదిరెడ్డి

బీజేపీ నాగర్‌కర్నూల్ క్లస్టర్‌లో నిర్వహించిన ప్రధాని మోదీ సభకు నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి హాజరయ్యారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ క్లస్టర్‌లో నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన సభలో ఎంపీ అభ్యర్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆ సమావేశానికి సైదిరెడ్డి హాజరయ్యారు. జిల్లా నేతలకు ఆ సభకు ఆహ్వానం లేకపోవడంతో ఆయనొక్కరే హాజరయ్యారు.

సత్వర న్యాయానికే లోక్‌అదాలత్

- మొత్తం 8,010 కేసులు పరిష్కరించాం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్
- జాతీయ లోక్‌అదాలత్‌లో వివరాల వెల్లడి



భార్యాభర్తలను ఒక్కటి చేసిన సందర్భంగా మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల(సూర్యాపేట): కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి సత్వర న్యాయం కల్పించేందుకే జాతీయ మెగాలోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. భార్యాభర్తలు మనస్పర్థలు వస్తే కూర్చొని పరిష్కారం చేసుకోవాలని, పిల్లల ముందు ఘర్షణ పడితే వారి చదువు, వారి ఎదుగుదలపై ప్రభావితం చూపుతుందన్నారు. పేదలకు ఎలాంటి ఖర్చులు లేకుండా ఉచితంగా న్యాయసేవలు అందించాలనే లక్ష్యంతో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే రాజమార్గం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన నాలుగు బెంచీల ద్వారా సివిల్, క్రిమినల్, వెహికల్, బ్యాంకు, ఎక్సైజ్, విద్యుత్, గృహహింస వంటి 2,485 కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి, సూర్యాపేట కోర్టుల్లో మొత్తం 8,010 కేసులను పరిష్కారం అయినట్లు తెలిపారు. కొంత కాలంగా విడిపోయి జీవిస్తూ లోక్ అదాలత్‌లో ఒక్కటైన ఐదు జంటలను కోర్టు ప్రాంగణంలో ఒక్కటిచేశారు. మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పులిహోర పొట్లాలు, మజ్జికను కక్షిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.అమరావతి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్యయాదవ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బీజేపీ పాలన అవినీతిమయం

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): దేశంలో బీజేపీ పాలన అవినీతి మయంగా మారిందని, ఇందుకు ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారమే నిదర్శనమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శనివారం సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.100 కోట్ల టర్నోవర్ కూడా లేని కంపెనీ రూ.200 కోట్లు ఫండ్ ఇచ్చినట్టు, సొంత వెబ్‌సైట్ కూడా లేని కంపెనీలు రూ.125 కోట్లు, ఏటా రూ.330 కోట్లు నష్టాలు చూపుతున్న ఎయిర్‌టెల్ కంపెనీ బీజేపీకి రూ.300 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు చెల్లించినట్లు బయటపడడం నిజంగా మనీ ల్యాండరింగ్ జరిగినట్టు పేర్కొన్నారు. దేశంలో బీజేపీతో పాటు టీడీపీ, జనసేన, టీఎంసీ పార్టీలు కూడా అవినీతి బురదలో కూరుకుపోయాయన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు ఉప్పెల నారాయణరెడ్డి, యల్లావుల రాములు, మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, ధూళిపాల ధనుంజయ నాయుడు, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

రామన్నపేట : విధుల్లో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై రామన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సాయంత్రం చౌటుప్పల్ నుంచి రామన్నపేటకు వస్తుండగా జైకేసారం వద్ద శ్రీనివాస్‌రెడ్డి బస్సు ఎక్కాడు. అంబబావిగూడెం వద్ద బస్సును ఆపే విషయంలో కండక్టర్, ప్రయాణికుడు శ్రీనివాస్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీనివాస్‌రెడ్డి ఈ క్రమంలో కండక్టర్‌పై చేయి చేసుకోవడంతో గాయమైంది. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

కోడలి దాడిలో గాయపడిన అత్త మృతి

వలిగొండ : కోడలి దాడిలో గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం ఎం. తుర్కపల్లి గ్రామానికి చెందిన బద్దం యాదమ్మ(70)కు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. అందరికీ వివాహాలు జరిపించింది. యాదమ్మకు గ్రామంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. భూమిని పంపిణీ చేయాలని కొంతకాలంగా యాదమ్మపై పెద్ద కోడలు స్వరూప ఒత్తిడి తెస్తోంది. ఇదే విషయంపై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 12వ తేదీన అత్తాకోడళ్ల మధ్య భూపంపిణీ విషయంలో గొడవ తారస్థాయికి చేరింది. దీంతో పెద్ద కోడలు స్వరూప ఆవేశంతో బలమైన కర్రతో అత్త యాదమ్మపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆమెను మోత్కూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. మృతదేహానికి భువనగిరి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి చిన్న కుమారుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చిట్యాల: అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలోని ఒడిశా ఫ్యామిలీ దాబాకు ఈ నెల 14న గుర్తు తెలియని వ్యక్తి(45) భోజనం చేసేందుకు వచ్చాడు. టేబుల్‌పై కూర్చున్న సమయంలో అతడికి మూర్ఛ వచ్చి పడిపోయాడు. దాబా హోటల్ యజమాని అతడిని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. దాబా యజమాని గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

లోక రక్షకుడిగా యాదగిరీశుడు



గోవర్ధనగిరిధారి అలంకార సేవ ముందు పారాయణం చేస్తున్న ఆచార్యులు, పాల్గొన్న హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి



సింహ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు, చిత్రంలో ఈఓ భాస్కర్‌రావు తదితరులు

- ఉదయం గోవర్ధనగిరిధారిగా..
- రాత్రి సింహ వాహనంపై ఊరేగిన నృసింహుడు
- యాదాద్రిలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు
- నేడు ఎదుర్కోలు ఉత్సవం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణ ఘడియలు సమీపిస్తున్న వేళ అలంకార, వాహన సేవలను ఆలయ ఆచార్యులు పంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్నారు. ఆలయంలో శనివారం సుప్రభాత వేళ శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరీ నిర్వహించిన ఆచార్యులు అనంతరం నిత్య పూజలు చేపట్టారు.

ఉదయం గోవర్ధనగిరిధారిగా..

ఉదయం స్వామి వారు లోకములను రక్షించే దేవుడిగా గోవర్ధనగిరిధారి అలంకార సేవలో ఆలయ వీధుల్లో ఊరేగారు. అనంతరం స్వామి వారి అలంకార సేవను తూర్పు రాజగోపురం ముందు వేంచేపు చేసి పారాయణికులు, ఆచార్యులు, రుత్వికులు పారాయణాలు, వేద మంత్రాలు పఠించారు. వేడుకల్లో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి దంపతులు, దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయంలో ఆచార్యులు నిత్యారాధనలు కొనసాగించారు. అనంతరం స్వామి వారిని సింహ వాహనంపై ఊరేగించారు. ఉగ్ర నారసింహుడు సింహ వాహనంపై వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు గొలిపారు. అనంతరం తూర్పు మాఢ వీధిలో అధిష్ఠింపజేసి పారాయణం పఠించారు. ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులకు, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఇక ఉదయం నుంచి రాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీస్వామి వారిని జగన్మోహిని అలంకార సేవలో ఊరేగిస్తారు. కల్యాణ నారసింహుడిగా తీర్చిదిద్దే పర్వంలో రాత్రి స్వామి వారు అశ్వవాహన సేవ ఆలయ మాఢ వీధుల్లో ఊరేగుతూ ఎదుర్కోలు ఉత్సవానికి వచ్చే ఘట్టాలను జరపనున్నారు. ఇందుకు సంబంధించి తూర్పు మాఢ వీధిలో వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఎదుర్కోలు కార్యక్రమానికి స్థానిక ప్రజలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వస్తారని అధికారులు భావిస్తున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్

- బస్సులో మరిచిపోయిన పర్సు ప్రయాణికురాలికి అందజేత
- పర్సులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు



ప్రయాణికురాలికి పర్సు అందజేస్తున్న ఆర్టీసీ డ్రైవర్ రామచంద్రం

చౌటుప్పల్ : ప్రయాణికురాలు మరిచిపోయిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు కలిగిన పర్సును తిరిగి ఆమెకు అప్పగించి ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. చౌటుప్పల్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ లావణ్య తన సోదరి వివాహానికి హాజరయ్యేందుకు శనివారం మిర్యాలగూడ డిపోకు చెందిన బస్సులో ఎంజీబీఎస్ నుంచి చౌటుప్పల్‌కు వచ్చింది. బస్‌స్టేషన్ వద్ద బస్సు దిగి వెళ్లిపోయింది. అదే సమయంలో చౌటుప్పల్‌కు చెందిన నార్కట్‌పల్లి డిపో బస్‌డ్రైవర్ బి.రామచంద్రం విధులకు అదే బస్సులో వెళ్తున్నాడు. బస్సు సీటులో తనకు లభించిన పర్సును గమనించి తీసుకున్నాడు. స్థానిక హోంగార్డు పాపయ్య ద్వారా బాధితురాలి గురించి తెలుసుకుని వెనక్కి వచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పర్సును పోలీసులకు ఇచ్చాడు. ఆ తర్వాత పోలీసులు బాధితురాలు లావణ్యను పిలిపించి పర్సు అప్పగించారు. ఆ పర్సులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 16వందల నగదు ఉంది. విలువైన పర్సును నిజాయితీగా అప్పగించిన డ్రైవర్ రామచంద్రంను ప్రయాణికులరాలితో పాటు పోలీసులు అభినందించారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం



మాట్లాడుతున్న ముతవలీల వారసులు

భానుపురి (సూర్యాపేట): తమను జాన్‌పహాడ్ దర్గా ముతవలీలుగా నిర్ధారిస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని దర్గా ముతవలీల వారసులు మహమ్మద్ గులాం రసూల్, మహమ్మద్ అబ్దుల్ హన్నాన్ అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాన్ పహాడ్ దర్గాపై 400 సంవత్సరాలుగా తమ తాత ముత్తాతలు మూతవాలిలుగా విధులు నిర్వహించే వారని పేర్కొన్నారు. దర్గా వక్ఫ్ బోర్డు స్వాధీనం అయిన తర్వాత తమను దర్గాలోకి రానివ్వకుండా అడ్డుకోవడంతో తాము హైకోర్టుకు వెళ్లినట్లు వివరించారు. ఇటీవల కోర్టు తమను మూతవాలిలుగా నిర్ధారిస్తూ తీర్పు ఇవ్వడం పట్ల హైకోర్టు న్యాయవాదులు మహమ్మద్ ఖురేషి, వంశీధర్ రెడ్డి, భార్గవిలకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ముతవలీలుగా జాన్ పాడ్ దర్గా వద్దకు వెళ్లనున్నామని అధికారులు సహకరించి మా విధులు సక్రమంగా నిర్వర్తించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ పెద్ద హైమదు హుస్సేన్ ముతవాలిగా కొనసాగానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ అలీ, మహమ్మద్ కాలేద్, మహమ్మద్ అబ్దుల్ హై కతిరి తదితరులు ఉన్నారు.

వినయ్‌భానురెడ్డి సేవలు చిరస్మరణీయం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



కల్నల్ వినయ్‌భానురెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న విప్ బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం : దేశరక్షణలో సైనికుల పాత్ర కీలకమని, విధి నిర్వహణలో అకాలమరణం పొందిన లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి సేవలు చిరస్మరణీమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బొమ్మలరామారం మండల కేంద్రంలోని గుడిబావి చౌరస్తాలో శనివారం లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భానురెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశ సైనికుల త్యాగాలతోనే ప్రజలందరు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారని తెలిపారు. లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భానురెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి సైతం లెఫ్టినెంట్ కల్నల్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులు నర్సింహారెడ్డి, విజయ లక్ష్మి, భార్య మేజర్ స్పందనారెడ్డి, కూతుళ్లు ఉద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, మాజీ చైర్మన్ మోకు మధుసూదన్ రెడ్డి, ఎర్వ హేమంత్ రెడ్డి, మహేష్ గౌడ్, భరత్, బండ వెంకటేష్, వంశీ రెడ్డి, మల్లేష్, జంగారెడ్డి పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ

ఎంజీయూ (నల్లగొండ రూరల్): జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని బెలూరు కాలేజీ ఆఫ్ మెడిసిన్ యూఎస్ఏ అధ్యాపకుడు కె.రామకృష్ణ అన్నారు. శనివారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో హ్యూమన్ మట్ మైక్రో బయోట, ఏ న్యూఫ్రాంటియర్ ఇన్ ఎండోమెట్రిసిస్ డయాగ్నోస్టిక్స్ అండ్ తెరపూటిక్స్ అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్య జీవితంలో ఆరోగ్య సంరక్షణలో సూక్ష్మ జీవుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. గర్భ కోశ సంబంధిత సమస్యల గుర్తింపు, నివారణలో ఆహారంలో సూక్ష్మ జీవుల వైవిధ్యం, పరిమాణం పాత్రను విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. మానవ శరీరంలో రెండో మెదడుగా భావించే జీర్ణాశయాల్లో సూక్ష్మ జీవుల వైవిధ్య పరిమాణం, మానసిక ఆరోగ్యాన్ని సైతం ప్రభావితం చేస్తుందన్నారు. సమతుల ఆహారానికి సరైన అర్థం సూక్ష్మజీవులతో నిండిన సహజ ఆహారం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రేమ్‌సాగర్, మాధురి, రమేష్, జ్యోతి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

నూతనకల్ : పిచ్చి కుక్కదాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నూతన్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన అనంతుల వీరయ్య, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, అనంతుల కృష్ణయ్య వ్యక్తిగత పనుల మీద వెళ్తున్నారు. ఈ క్రమంలో కుక్క వారిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పిచ్చికుక్కను గ్రామస్తులు చంపి దహనం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

చిట్యాల : నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన వనం వెంకటమ్మ, రాములు(48) దంపతులు తమ కూతురుకు వైద్యం చేయించేందుకు ఐదు రోజుల క్రితం చిట్యాల పట్టణానికి వచ్చారు. శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో రాములు చిట్యాల పట్టణంలోని భువనగిరి రోడ్డుకు వచ్చాడు. అక్కడ టీ తాగిన తర్వాత రోడ్డు దాటుతుండగా భువనగిరి వైపు వెళ్తున్న అశోక్ లీలాండ్ దోస్త్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య వెంకటమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి

గరిడేపల్లి : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. మఠంపల్లి మండలం బిల్యానాయక్ తండాకు చెందిన ధరావత్ నవీన్(21) పని నిమిత్తం గరిడేపల్లి నుంచి సూర్యాపేటకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో మర్రికుంట గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఇతడి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ధరావత్ నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

హుజూర్‌నగర్ : వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు శనివారం పట్టణంలోని ఓ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన లొడంగి సాయికృష్ణ, శిరీష పెద్ద కుమారుడు రితిక్ సిద్దార్థ (5)కు శుక్రవారం వాంతులు, విరేచనాలు, జ్వరం ఉండగా గరిడేపల్లిలోని ఆర్‌ఎంపీ చంద్రయ్యను సంప్రదించారు. అనంతరం హుజూర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగా చనిపోయాడని తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రెస్పెదుట ధర్నా ఆందోళన చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులను సముదాయించారు. ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. అనంతరం మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ స్టేషన్ ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ గుగులోతు రాములు తెలిపారు.

ఆధ్యాత్మిక భావనలు సన్మార్గానికి దోహదం

- ప్రముఖ యాంకర్ సుమ కనకాల



కల్యాణోత్సవంలో పాల్గొన్న సుమ, బీఆర్ఎస్ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి



కోనేరును ప్రారంభిస్తున్న యాంకర్ సుమ కనకాల, గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు

భూదాన్‌పోచంపల్లి : ఆధ్యాత్మిక భావనలు మనిషి సన్మార్గంలో పయనించడానికి ఎంతో దోహదపడుతాయని టీవీ, సినీ ఆర్టిస్ట్, ప్రముఖ యాంకర్ సుమ కనకాల అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముకుల గ్రామంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి తిరు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభోవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు ధరింపజేసి 20 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు, ముత్యాల తలంబ్రాలు పోసి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. సుమ కనకాలతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమ కనకాల మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలందరికీ సనాతన ధర్మం, దైవ భక్తి, పెద్దలు, గురువుల పట్ల మర్యాద, సంస్కృతీ సంప్రదాయాలను నేర్పించాలని అన్నారు. 21 ఏళ్లుగా దిగ్విజయంగా శ్రీవారి బ్రహోత్సవాలు నిర్వహిస్తున్న ఆలయ నిర్మాణకర్తలు కోట పుష్పలత మల్లారెడ్డి దంపతుల సేవలను అభినందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కోట అభిలాష్‌రెడ్డి శ్రీజ దంపతుల సహకారంతో నూతనంగా నిర్మించిన కోనేరు (పుష్కరిణి)ని బీఆర్ఎస్ రాష్ట్ర యువనాయకుడు గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వీరికి ఆలయ నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, నాయకులు రావుల శేఖర్‌రెడ్డి, పాటి సుధాకర్‌రెడ్డి, బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, కోట అంజిరెడ్డి, పగిళ్ల సుధాకర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గట్టు పాండురంగారెడ్డి, అధ్యక్షుడు పాక నర్సింహయాదవ్, రంగ మధుగుప్త, భూపాల్‌రెడ్డి, రంగారెడ్డి,లింగస్వామి, భోగ చంద్రశేఖర్,ఐలయ్య, వేణుగోపాలచారి, రాములు, చుక్క యాదయ్య, నవీన్, బాలాచారి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానాలపై ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

గరిడేపల్లి : శాస్త్రవేత్తలు సమగ్ర వ్యవసాయ విధానాలపై రైతులను ప్రోత్సహించాలని అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పాలెం డాక్టర్ ఎం.మల్లారెడ్డి అన్నారు. శనివారం కేవీకే గడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాస్త్రవేత్తలు రైతుల ఆదాయం రెట్టింపునకు కృషి చేయాలని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై ప్రోత్సాహం, సమగ్ర వ్యవసాయ విధానాలు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ఇంచార్జి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నరేష్ 2023–24 సంవత్సరంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను, శాస్త్రవేత్తలు నరేష్, సీహెచ్ నరేష్, కిరణ్, ఆదర్శ్, మాధురి, ఎన్. సుగంధి చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉద్యాన, పట్టు విభాగ అధికారి నాగయ్య, డీడీఎం నాబార్డ్ వినయ్‌కుమార్, జగన్, మల్లీశ్వరి, రామ్‌బాబు పాల్గొన్నారు.

పాఠశాలలో మందుబాబుల వీరంగం



విరిగిన మూత్రశాలల దోర్లు



పగులగొట్టిన బీరు సీసాలు

సూర్యాపేట రూరల్ : టేకుమట్ల పాఠశాలలో శుక్రవారం రాత్రి మందుబాబులు వీరంగం సృష్టించారు. పాఠశాలలోని మూత్రశాలల డోర్‌లు, తరగతి గదుల్లోని ఫ్యాన్లు, కిటికీలు ధ్వంసం చేసి బీర్ సీసాలను పగలగొట్టారని గ్రామస్తులు, ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల పాఠశాల ప్రాంగణాన్ని ఆకతాయిలు ప్రతిరోజు బీభత్సం సృష్టిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంపై పోలీసులు దృష్టి పెట్టి ఆకతాయిలను నియంత్రించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆర్థిక పురోగతిలో భారత్ ఐదో స్థానం

- ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ

నల్లగొండరూరల్ : ఆర్థిక పురోగతిలో భారత్ ఐదో స్థానంలో ఉందని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంజీయూలో శనివారం నిర్వహించిన ప్రేరణ 2024 విశ్వవిద్యాలయ స్థాయి కామర్స్ ఫెస్ట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా కామర్స్ సిలబస్‌ను నవీకరించడం అవసరమన్నారు. దేశ అభివృద్ధిలో కామర్స్ పాత్ర కీలకమన్నారు. మెరుగైన ఫలితాలు సాధించాలంటే పరిశోధనలు నిర్వహించాలన్నారు. కామర్స్ విద్యార్థులు ప్రాథమిక అంశాల పట్ల అవగాహన ఉంటే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కామర్స్ ఫెస్ట్ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సూర్యాపేట, చర్లపలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నీలగిరి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ నెల 23న సికింద్రాబాద్ పీజీ కాలేజీలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాలరవి, కొప్పుల అంజిరెడ్డి, అధ్యాపకులు ఆకుల రవి, శ్రీదేవి, శేఖర్, ఎం.వి.ఎస్.రెడ్డి, రవిచంద్ర పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుధారాణి

నల్లగొండరూరల్: ఎంజీయూలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుధారాణిని నియమిస్తూ శనివారం వీసీ గోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ విభాగ అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె గతంలో ఈ యూనివర్సిటీలో హస్టల్ డైరెక్టర్, ఎన్ఎస్ఎస్ పీఈఓగా విధులు నిర్వహించారు.

గడ్డి మందు తాగిన యువకుడు మృతి



మహిపాల్‌రెడ్డి (ఫైల్)

మోత్కూర్ : గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. మోత్కూరు మండలం బుజిలాపురం గ్రామానికి చెందిన నేవూరి మహిపాల్ రెడ్డి (24) కొంత కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. అనారోగ్య సమస్యలకు మనస్తాపం చెందిన మహిపాల్‌రెడ్డి ఈ నెల 15న ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్ లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి మేనమామ రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో ఇంటికి నిప్పు



ఉప్పలమ్మ ఇంట్లోంచి వస్తున్న మంటలు

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి తల్లిపై దాడికి యత్నించాడు. తప్పించుకోవడంతో ఆమె దుస్తులకు నిప్పంటించడంతో ఆ మంటలు ఇంటికి అంటుకున్నాయి. ఆత్మకూరు (ఎస్) మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పాతర్లపాడు గ్రామానికి చెందిన చిలుకూరి బాలయ్య– ఉప్పలమ్మల కుమారుడు విక్రమ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల మద్యానికి బానిసై తరచూ తల్లిదండ్రులను వేధించేవాడు. విక్రమ్ రెండు రోజులుగా తల్లిని మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. శనివారం డబ్బులు ఇవ్వాలంటూ దాడికి యత్నించగా ఉప్పలమ్మ తప్పించుకున్నది. ఆ కోపంతో మద్యం మత్తులో ఉన్న విక్రం బీరువాలో ఉన్న తల్లి బట్టలను తీసి తగులబెట్టాడు. ఆ మంటలు కాస్త ఇంటికి అంటుకొని సామాన్లతో పాటు బట్టలు పూర్తిగా కాలిపోయాయి.ఫైర్ ఇంజన్ సహకారంతో స్థానికులు మంటలు ఆర్పారు. ఇంటి నుంచి మంటలు రావడంతో విక్రం అక్కడి నుంచి పరారయ్యాడు.